ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 26 నవంబరు 2025

మహిళలకు ఆర్థిక భరోసానివ్వడమే ప్రభుత్వ లక్ష్యం

-ములుగు కలెక్టర్ దివాకర



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలు మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని, మహిళలకు ఆర్థిక భరోసానివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని తొమ్మిది మండలాల స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల 26 లక్షల 76వేల వడ్డీలేని రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 60ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని, వాటి ద్వారా 21,364 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేవారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రభుత్వం పెట్టుబడి సహాయం దారా జిల్లాలో 1300 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున తక్షణమే అందించగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించుకున్నారని అన్నారు. గ్రంథాలయసంస్థ చైర్మన్ రవిచందర్ , ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీఆర్డీవో శ్రీని వాసరావు, ఎల్డీఎం జయప్రకాష్, ఏపీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

ములుగు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు నూతన ఎస్పీగా విధుల్లో చేరిన సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు పూలమొక్క అందజేయగా ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31వరకు జరిగే మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

రిజర్వాయర్ మత్తడి నిర్మాణ పనులు అడ్డగింత

పరిహారం చెల్లించిన తర్వాతు పనులు చేయాలన్న భూనిర్వాసితులు

కాటారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని గారెపల్లి రిజర్వాయర్ మత్తడి నిర్మాణ పనులను మంగళవారం పలువురు భూనిర్వాసితులు అడ్డుకున్నారు. మత్తడి నిర్మాణం కోసం యంత్రాలతో పనులు సాగిస్తుండగా తమకు పరిహారం ఇచ్చే వరకు పనులు చేయొద్దని కొందరు నిర్వాసితులు అభ్యంతరం తెలిపారు. యంత్రాల ముందు కూర్చుని నిరసన తెలిపారు. తమకు పరిహారం అందించకుంటే పనులు సాగనివ్వమని తేల్చి చెప్పారు. ఇరిగేషన్ ఏఈ వెంకన్న, పోలీసులు వచ్చి పనులు చేయనివ్వండని, ఏదైనా ఉంటే అధికారులతో మాట్లాడాలని నచ్చజెప్పడంతో వారు శాంతించారు. పనులను అడ్డగించిన వారిలో గజ్జల లింగయ్య, బౌతు ఆశమ్మ, దుర్గం మల్లక్క, రాజయ్య, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.





పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల నగారా మోగింది. స్థానిక ఎన్నికల షెడ్యూల్ మంగళవారం విడుదలైంది. ములుగు మునిసి పాలిటీ మినహా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ములుగు జిల్లాలో 10 మండలాలు 171 గ్రామపంచాయతీలు, 1,290 వార్డులు ఉన్నాయి. వీటిలో 2,29,159 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,10,838 మంది పురుషులు, 1,18,299 మంది మహిళలు 22 మంది ఇతరులు ఉన్నారు. కాగా మంగపేట మండలంలో గిరిజన, గిరిజనేతర సమస్య ఉండడంతో అక్కడ ఉన్న 25 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించడంలేదు. ప్రస్తుతం 146 జీపీల లో ఎన్నికలు జరగనున్నాయి.

- ములుగు (ఆంధ్రజ్యోతి)

ములుగు జిల్లాలో 10 మండలాలకు గాను మంగపేట మండలం మినహా మిగిలిన 9 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలో తాడ్వాయి, ఏటూరు నాగారం, గోవిందరావుపేటలోని 48 జీపీలు, 420 వార్డులకు ఎన్నికలు నిర్వహి ంచనున్నారు. రెండో విడతలో జేడీ మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్ మండలా ల్లోని 52 గ్రామ పంచాయతీలు, 462 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మూడవ విడతలో వెంకటాపురం, వాజే డు, కన్నాయిగూడెం మండలాల్లోని 46 జీపీలు, 408 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

సర్పంచ్ ఎన్నికల తేదీలు ఇలా ఉన్నాయి..

ఈ నెల 27న మొదటి విడుత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 29న ముగియ నుంది. స్ర్కూటిని 30న ఉండనుంది. విత్‌డ్రా చేసుకునేందుకు డిసెంబరు 3న చివరితేది. అలాగే రెండో విడుత నామినేషన్లు ఈ నెల 30 న ప్రారంభమై డిసెంబరు 2న ముగుస్తుంది. డిసెంబరు 3న స్ర్కూటిని ఉంటుంది. డిసెంబరు 6న విత్‌డ్రా చేసుకోవడానికి చివరితేదీ. మూడో విడత డిసెంబరు 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై డిసెం బరు 5న ముగుస్తుంది. డిసెంబరు 6న స్ర్కూటిని ఉంటుంది. కాగా డిసెంబరు 9న విత్‌డ్రా చేసుకునేందుకు చివరి తేది అని ఎన్నికల అధికారులు ప్రకటించారు. డిసెంబరు 11న మొదటి విడత ఎన్నికలు, డిసెంబరు 14న రెండో విడత, డిసెంబరు 17న మూడో విడత ఎన్నికలు జరగనున్నా యి. ఎన్నికలు జరిగిన అదే రోజున ఫలితాలు విడుదల చేస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా ఉదయం 7 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ జరిగిన గంట తర్వాత ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే ఫలితాలు విడుదల చేస్తారు.

మండలాల వారీగా ఓటర్ల జాబితా

మండలం	జీపీలు	వార్డులు	ఓటర్లు
వాజేడు	17	152	19,431
వెంకటాపురం	18	166	25,336
తాడ్వాయి	18	152	18,226
ములుగు	19	172	24,985
మంగపేట	25	230	39,369
జేడీ మల్లంపల్లి	10	90	13,507
కన్నాయిగూడెం	11	90	9,992
గోవిందరావుపేట	18	154	25,441
ఏటూరునాగారం	12	114	24,636
వెంకటాపూర్	23	200	28,236

భూపాలపల్లి జిల్లాలో..

ఒక్కో విడుతలో నాలుగేసి మండలాలకు ఎన్నికలు

కృష్ణకాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పల్లె నగారా మోగింది. స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయింది. ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించింది. మూడు విడుతల్లో ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలను మంగళవారం రాత్రి జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మూడు విడుతల్లో ఈ ఎన్నికలు ఉండనున్నాయి. మొదటి విడత ఈ నెల 27న నామినేషన్ల స్వీకరణ ఉండనుండగా వచ్చే నెల 11న పోలింగ్ ఉండనుంది. అలాగే రెండో విడుత ఈ నెల 30న నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభమవగా.. డిసెంబర్ 14న పోలింగ్ ఉండనుంది. ఇక మూడో విడుత డిసెంబరు 3న నామినేషన్ల స్వీకరణ ఉండనుం డగా డిసెం బరు 17న పోలింగ్ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 248 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే, 2102 వార్డులు ఉన్నాయి. జిల్లాలో మొదటి విడుతలో గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లో ఎన్నికలు ఉండనున్నాయి. అలాగే రెండో విడుతలో చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల్లో ఎన్నికలు ఉండనుండగా.. మూడో విడతలో మల్హర్‌రావు, మహదేవపూర్, మహముత్తారం, కాటారం మండలాల్లో ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించింది. నేటి సాయంత్రం నుండే ఆయా గ్రామాల్లో ఎన్నికల కోడ్ సైతం అమలులోకి వచ్చింది. మొత్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఆశావాహులు పోటీల్లో నిలిచేందుకు ఉవ్విల్లూరుతున్నారు. గ్రామాల్లో ఇక బుధవారం నుంచి ఎన్నికల సందడి కానరానుంది.



ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శిబిరం

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



భూపాలపల్లిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమైన సమస్యలపై ఈ నెల 28న జిల్లా కేంద్రంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక పరమైన ఆస్తుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం మీడబ్బు.. మీహక్కు అనేవిధంగా ప్రత్యేక కార్యక్ర మాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 28న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉమ్మడి శిబిరం జరుగుతుందని తెలిపారు. బ్యాంకుల్లో పది సంవత్సరాలకుపైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం..



మురుమూరులో ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు వద్ద సీఆర్పీఎఫ్ జవాన్‌లతో ఐజీ విక్రమ్, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

- సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
- మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ప్రారంభం
- కర్రెగుట్టలపై రహదారి నిర్మాణం చేపడతామని స్పష్టం

వివరాలు 7వ పేజీలో...

ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువత టాస్క్ ఆధ్వర్యంలో టెలీ పెర్ఫార్మెన్స్ కంపెనీలో కల్పించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. టెలీ పెర్ఫార్మెన్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువత అర్హులని అన్నారు. కంపెనీ ద్వారా 100మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ఆసక్తి ఉన్న యువత 96184 49360 నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 1న ములుగు రీజినల్ సెంటర్‌లో ఎంపిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సైన్స్‌ల్యాబ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఎంవో విజయపాల్‌రెడ్డి

మొగుళ్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ల్యాబ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) పింగిలి విజయపాల్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన బయోసైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సైన్స్ విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం కేటాయించిన సైన్స్‌ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సైన్స్‌ల్యాబ్‌లు విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం, అన్వేషణాతత్వం పెంపొందించడానికి కీలకమని, ప్రతీ పాఠశాలలో ల్యాబ్, పరికరాలు సక్రమంగా ఉపయోగపడేవిధంగా ల్యాబ్ నిర్వహణ రికార్డులు క్రమానుగతంగా నిర్వహించాలన్నారు. సైన్స్ విద్య నాణ్యతను పెంచడంలో ల్యాబ్‌ల సక్రమ వినియోగం కీలకమైందని, దీనిపై ప్రతీ పాఠశాల కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం తదితర అంశాలపై విశ్లేషణ చేశారు. సమావేశంలో ఆర్పీలు సునీల్, సంపత్, శ్రీకాంత్ తదితంలు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల నిరాహార దీక్షలు



మునిసిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన కార్మికులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుడు బొల్లి రాజయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తోటి కార్మికులు కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఈ నెల 23న వృత్తి రీత్యా విధులకు హాజరైన రాజయ్య చెట్టు కొడుతున్న క్రమంలో అస్వస్థతకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. అయితే అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రాజయ్య మృతి చెందాడని ఆరోపిస్తూ మునిసిపల్ కార్మికులంతా ఆందోళనకు దిగారు. గత మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలకు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సదానందం, బాబులు మాట్లాడుతూ రాజయ్య కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రూ. 50లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగి మూడు రోజుల గడిచిన మునిసిపల్ కమిషనర్, కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వెంటనే తమ డిమాండ్‌లకు అంగీకరించి హామీ ఇస్తే ఆందోళన విరమిస్తామని చెప్పారు. కాగా మునిసిపల్ కార్మికులు చేపట్టిన దీక్షలకు బీసీ జేఏసీ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు అండగా ఉంటామని జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్, నాయకులు రవీందర్, రాదండి దేవేందర్, మహర్షి, హరీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్య సేవలు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- సీటీ స్కాన్ యంత్రం ప్రారంభం



భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీస్కాన్ గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ప్రధాన్ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో రూ.3.40 కోట్లతో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ యంత్రాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాతో పాటు ఇతర జిల్లాలనుంచి ఆస్పత్రికి వచ్చి వైద్య చికిత్సలు పొందుతున్నారన్నారు. ఆస్పత్రిలో వెంటిలేటర్లు, సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుతో అనారోగ్య బాధితులు వరంగల్, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 203 పోస్టులను మంజూరుచేసి, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల పునరుద్ధరణకు రూ.20కోట్లు



పునరుద్ధరణ పనులు జరిగే కాటారం-మేడారం రోడ్డు

కాటారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కాటారం డివిజన్ పరిధిలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా ప్రభుత్వం రెండు బీటీ రోడ్ల పునరుద్ధరణకు రూ.20కోట్ల నిధులు మంజూరు చేసింది. మేడారం మహాజాతర-2026 నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో కాటారం, మహాముత్తారం మండలాల్లో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నుంచి రూ.20కోట్ల నిధులతో బీటీ రోడ్ల పునరుద్ధరణ జరగనుందని అధికారులు మంగళవారం తెలిపారు. ఎండీఆర్(మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్)ప్రణాళికలో భాగంగా రోడ్లు, భవనాలశాఖ ద్వారా కాటారం మండలంలో శంకరంపల్లి నుంచి రుద్రారం వరకు ఉన్న బీటీ రోడ్డు పునరుద్ధరణ పనుల కోసం రూ.8కోట్లు, కాటారం-మేడారం రోడ్డు పునరుద్ధరణ పనులు, బ్రిడ్జిల అప్రోచ్ పనులకు రూ.12కోట్ల నిధులు మంజూరైనట్లు గిరిజన సంక్షేమ, రోడ్లు భవనాలశాఖ అధికారులు తెలిపారు. బీటీ రోడ్ల పునరుద్ధరణ పనుల కోసం రూ.20కోట్ల నిధులు మంజూరు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కేటీపీపీ ప్రధాన ముఖద్వారం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలి

● జాయింట్ కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి

గణపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ (ఏపీఎస్ఈబీ) రూల్స్ వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుంకు సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రధాన ముఖద్వారం ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర పరిధిలోని ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఎగ్యూలరైజ్ చేయకుండా రెండు రకాల సర్వీస్ రూల్స్‌లను ఏర్పాటు చేసిందన్నారు. కార్మికులకు 1947యాక్ట్ ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టిజన్ సంఘం యూనియన్ నాయకులు సాయిలు, చంద్రారెడ్డి, శ్రీధర్, చందన్ సింగ్, ఠాగూర్, రమేష్, శంకర్, కృష్ణ, ప్రణయ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ



మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

వాజేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములలో పంట మార్పిడి చేస్తే తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వాజీద్, లావణ్య అన్నారు. మంగళవారం మండలంలోని పేరూరులో రెండు శాఖల అధికారులు మిర్చి పంటలో వేరుకుళ్లు, ఎండు తెగులు వచ్చిన పంటలను పరిశీలించారు. ఈ తెగులు ఆశించిన మొక్కలు ఏ దశలోనైనా ఎండిపోతాయన్నారు. మొక్క మొదల్లో తెల్లటి శిలీంధ్రం పెరుగుదల కనిపిస్తుందన్నారు. వేర్లు కుళ్లిపోయి మొక్కలు క్రమక్రమంగా చచ్చిపోతాయని తెలిపారు. వీటి నివారణకు పంట మార్పిడి చేయాలన్నారు. అంతే కాకుండా ఒక లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ ద్రావణంను వేర్లు తడిచే విధంగా చేసి ఎకరానికి రెండు కిలోల ట్రైకోడెర్మా పోడిని 90 కిలోల పశువుల ఎరువును, 10 కిలోల వేప పిండిని మిశ్రమంగా చేసి చెట్ల మొదలలో చల్లుకోవాలని సూచించారు. వీరి వెంట ఏఈవో హరీష్ తదితరులు ఉన్నారు.

కొమురవెల్లి ఆలయ చైర్మన్‌గా నర్సింహారెడ్డి



నర్మెట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లి కార్జునస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నర్మెట మండలకేంద్రానికి చెందిన గంగం నర్సింహారెడ్డిని(డీసీసీ ఉపాధ్యక్షుడు) నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కొమురవెల్లి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్‌కు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మొగుళ్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సిపేట ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఏడవతరగతి విద్యార్థులతో ముఖాముఖిగా ముచ్చటించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, దీనికి కారణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బోధన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. గ్రంథాలయం నిర్వహించాలని, విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా మండలకేంద్రంలోని పల్లెప్రకృతివనంతోపాటు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను, ఇస్సిపేటలో పొన్నాల లక్ష్మి వ్యవసాయ పొలంలో ఉపాధిహామీ పథకం కింద నాటిన కొబ్బరి మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో బాలకృష్ణ, ఏపీవో మాధవి, టీఏరాము, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని అమ్మగార్డెన్‌లో మంగళవారం మండలంలోని స్వయం సహాయక సంఘాలకు రూ.2కోట్ల48లక్షల 35,730ల చెక్కులను ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, శాయంపేట మండలాల్లోని 2957 స్వయం సహాయక సంఘాలను గాను రూ.2కోట్ల48లక్షల35,730ల వడ్డీలేని రుణాలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయడం జరిగిందని అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు వడ్డీలేని రుణాలను పొంది వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు.

మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణంతోపాటు పలు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. వడ్డీలేని రుణాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్దపీట వేస్తుందని, మహిళలు ఈ రుణాలతో ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో బాలకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఏపీఎం రమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవితోపాటు వివిధ మండలాల ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీజీపీఏ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా లావణ్య

తరిగొప్పుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జనగామ జిల్లా తరిగొప్పుల మండలం పోతారం గ్రామానికి చెందిన కొండ్ర లావణ్య నియమితులయ్యారు. టీజీపీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కూరి యాదయ్య అధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లావణ్యను రాష్ట్ర జాయింట్ సెక్ర టరీగా నియమిస్తూ, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, గురుకులాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు పవన్‌కుమార్, సెక్రటరీ విజయ్‌కుమార్, గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక లారీలతో ట్రాఫిక్‌జామ్



ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన లారీలు

వెంకటాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలుబాక గ్రామం నుంచి అబ్బాయిగూడెం గ్రామం వరకు ఇసుక లారీలు నిలిచి ఉండడంతో మంగళవారం ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా లారీలను నిలపడంతో వాహనదారులు ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు ఉండడంతో ద్విచక్రవాహన దారులు, ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక లారీలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయం ఆవరణలో తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

నాపాక ఆలయం ఆవరణలో గుప్తనిధుల తవ్వకాలు

చిట్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నైన్‌పాక శివారులో గల సుప్రసిద్ధ నాపాక దేవాలయం ఆవరణలో సోమవారం రాత్రి గుప్తనిధుల కోసం దుండగులు జేసీబీ యంత్రం సహాయంతో తవ్వకాలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయం ప్రధాన అర్చకులు ప్రభాకరాచార్యులు ఆలయానికి వెళ్లగా మట్టి తవ్వకాలు, నిమ్మకాయలు కనిపించడంతో ఆలయ పాలకవర్గం, పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఆలయానికి చేరుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు త్వరలోనే తెలుపుతామని సీఐ మల్లేష్ తెలిపారు.

పాత ముఠా పనేనా...?

నైన్‌పాక గ్రామం పక్కనే ఉన్న వరికోల్‌పల్లి శివారు నందులబోడు గుట్టలో గతేడాది ఏప్రిల్‌లో పురాతన విగ్రహాల కోసం అదే గ్రామానికి చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి తవ్వకాలు చేపట్టారు. విషయం బయటకు తెలియడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏడుగురు వ్యక్తులను పట్టుకుని వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి పురాతన విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా సోమవారం రాత్రి గుప్త నిధుల కోసం మళ్లీ తవ్వకాలు చేపట్టడంతో పాత ముఠా సభ్యులే కారణమై ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సీనియర్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● టెట్ నుంచి మినహాయింపునివ్వాలి ● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

జనగామ కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం అమలు, ఎన్‌సీటీఈకి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) పిలుపు మేరకు మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల నుంచి ప్రధానమంత్రి కార్యాలయానికి గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జనగామ లోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రవి పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 25 లక్షల మంది, రాష్ట్రంలో 45 వేల మంది ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్న టెట్‌ను 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపునిస్తూ విద్యాహక్కు చట్టాన్ని సవరించాలన్నారు. 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు టెట్ రాయలేదని, హఠాత్తుగా రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే ఉద్యోగానికి ఉద్వాసన పలుకుతామని చెప్పడం సమంజసం కాదన్నారు. 26 నుంచి నెలాఖరు వరకు రాష్ట్రంలోని ఎంపీలందరికీ వినతి పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడూరి వెంకటేష్, ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాస్, కృష్ణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, కనకయ్య, ఆగయ్య, రవీందర్, రాజమౌళి, సుధాకర్ పాల్గొన్నారు.

లక్నవరం తైబందీ ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

గోవిందరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నవరం సరస్సు తైబందీ ప్రకటించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో మంగళవారం తెలంగాణ రైతుసంఘం మండల కమిటీ సమావేశం తీగల ఆదిరెడ్డి అధ్యక్షతన జరగగా వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈఏడాది లక్నవరం సరస్సు కింద అధిక వర్షాలతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. గత సంవత్సరం రబీలో వడగండ్ల వానతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటివరకు సరస్సులో 33 ఫీట్ల నీరు ఉందని, దీంతో సుమారు 6500ఎకరాల వరకు పంటలు పండే అవకాశం ఉందని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి లక్నవరం తైబందీ ఖరారు చేసి రంగాపురం, కోట, శ్రీరాంపతి కాల్వల ఆయకట్టుకు నీరందించాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు గుండు రామస్వామి, కాప కోటేశ్వర్‌రావు, సామ శ్రీనివాసరెడ్డి, క్యాతం సూర్యనారాయణ, బానోత్ మంక్తియా నాయక్, కన్నెజు సదానందం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ చిందు యక్షగాన కళాకారుడు మృతి



రాజ సుందర్ (ఫైల్)

వెంకటాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం రాజసుందర్(80) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన గత 40సంవత్సరాల నుంచి చిందు యక్షగాన కళారంగంలో ప్రావీణ్యం పొంది తాత, తండ్రుల నుంచి నాటకాలు, యక్షగానాలు చేయడంలో ప్రసిద్ధి. తన కలను గుర్తించి ఉమ్మడి భూపాలపల్లి జిల్లాలో జిల్లా ఉత్తమ కళాకారుడిగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా అవార్డు, సన్మానం పొందారు. రాజసుందర్ తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో రేడియో, టీవీలలో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. జన్మభూమి, మూఢనమ్మకాలు, ఎయిడ్స్‌పై అవగాహన, పచ్చదనం-పరిశుభ్రత, మాఊరు-మాచెరువు కార్యక్రమాల్లో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన కుటుంబానికి తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ నుంచి రూ.10లక్షల ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలని చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు కోరారు.

ఆయన మృతి తీరనిలోటని, జాతిబిడ్డను కోల్పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రాజసుందర్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా చిందు హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గజవెల్లి గణపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు గణేష్, గడ్డం హరిబాబు, తిరుపతి, రమేష్, తిరుపతి, చిరంజీవి, పున్నంచందర్, శరత్, శ్రీనివాస్, నరహరి, శ్రీహరి, సింహాద్రి, తిలక్‌లు ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

చిట్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకుతండ గ్రామానికి చెందిన గోపాల్, గద్దర్ ఇటీవల తమ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పిర్యాదు చేశారు. కాగా సెల్‌ఫోన్లను గుర్తించి మంగళవారం సీఐ మల్లేష్ బాధితులకు అప్పగించారు. సందర్భంగా కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను అభినందించారు.



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

'వడ్డీ లేని రుణాలు' అభినందనీయం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో ప్రారంభించిన వడ్డీ లేని రుణాల పథకం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ మునిసిపాలిటీ కార్యాలయంలో నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలకు చెందిన మహిళల స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.20 లక్షలు తీసుకున్న మహిళలకు కేవలం రూ.5 లక్షలకే వడ్డీలేని రుణం వర్తించడం కాకుండా ఆ పరిమితిని మహిళల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మరింతగా పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు

● ఎన్నికల నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలి

● టీఆర్పీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

జనగామ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలు ఎవరూ ఓటు వేయొద్దని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను నిరసిస్తూ జనగామ జిల్లాకేంద్రంలో ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. చేతకాని దద్దమ్మ అయిన రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు అగ్రవర్ణాలకు ఓట్లు వేస్తే బీసీలంతా తమ తలలు తాము నరుక్కున్నట్టేనన్నారు. బీసీలను మోసం చేసిన సీఎం, మంత్రులంతా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే వెనక్కి తీసు కోవాలని, లేదంటే ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను బీసీలు తరిమికొడతారని హెచ్చరించారు.



జనగామలో నిరసన తెలుపుతున్న తీన్మార్ మల్లన్న

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6880	6300
మక్కలు	1814	1521
కందులు	6360	3022
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	5000	3500
పల్లికాయ (పచ్చిది)	6300	3890
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14600	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	19500	12000
యూఎస్341ఏసీ	17000	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

మీ పత్తి బంగారం కావాలంటే..



- తేమ విషయంలో జాగ్రత్తలు పాటించాలి
- రైతులకు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం సూచన

వరంగల్ వ్యవసాయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో అతివృష్టి, అనావృష్టి వల్ల ఈసారి పత్తి దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. వచ్చిన కాస్త పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. అందుకే పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మంచి ధర రావాలంటే ఏం చేయాలి అనే అంశాలపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఆయన మాటల్లోనే చూద్దాం.

చేనుపై పత్తి పూర్తిగా విచ్చుకుని ఆరిన తరువాత ఏమాత్రం తేమలేని సమయంలో పత్తిని ఏరాలి. తరువాత నీడలో ఒకటి రెండు రోజులు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గానీ నిల్వ చేయడం వల్ల ఎలాంటి తేమ పెరుగదు.

చేనుపై పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టుమీదనే పూర్తిగా ఆరేలా చూడాలి. ఆ తరువాతే పత్తి తీయాలి.

ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. నీటిని కలుపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒకటి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధరపొందవచ్చు.

పత్తిని ఉదయం, సాయంత్రం సమయాల్లో కాకుండా కొద్దిగా ఎండ ఉన్న సమయాల్లో తీయాలి. ఎలాంటి పత్తిని తీయాలనే విషయంలో కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేరువేరుగానే మార్కెట్‌కు తీసుకురావాలి.

వివిధ రకాలైన పత్తిని కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆ రకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.


మల్లేశం, ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

సీసీఐ నిబంధనలు

- నాణ్యతలేని, రంగుమారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు.
- పత్తిని సంచుల్లో కాకుండా ట్రాలీ వాహనాల్లో తీసుకురావాలి.
- పత్తి రైతులందరూ సంబంధిత (ఏపీఎంసీ)లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- పత్తి రైతులకు చెల్లింపు నేరుగా (ఏబీపీఎస్/పీఎఫ్ఎంఎస్) ద్వారా వారి ఆధార్‌కు లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలోకి మాత్రమే జమ చేస్తుంది.

అందువల్ల పత్తి రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్‌కు లింక్ చేసుకోవాలి.

తేమ శాతం ముఖ్యం..

పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెల రూపంలో చూపిస్తుంది.

తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 8 శాతం వరకు ఉంటేనే మద్దతు ధర లభిస్తోంది. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా 8 నుంచి 12 వరకు తేమశాతం ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తోంది. అలా కాకుండా 12 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

పత్తిలో తేమ	మద్దతు ధర
8 శాతం	రూ.8.110లు
9 శాతం	రూ.8.028లు
10 శాతం	రూ.7.947లు
11 శాతం	రూ.7.866లు
12 శాతం	రూ.7.785లు


కథా నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సహృదయ ప్రతినిధులు

కాళోజీ కళాక్షేత్రంలో

రాష్ట్రస్థాయి కథానాటిక పోటీలు

జనవరి 1 నుంచి 4 వరకు ప్రదర్శన

వడ్డెపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కందాళం ఫౌండేషన్ (అమెరికా), సహృదయ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కథానాటికల పోటీలను నిర్వహించనున్నట్లు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహర బాబు, సంస్థ ప్రతినిధులు ఆచార్య డీఎస్ఎన్ మూర్తి, ఆచార్య అప్పాజ్యోశ్యుల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర స్థాయి కథానాటిక పోటీల కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2026 సంవత్సరం ప్రతిభామూర్తి జీవిత కాల సాధన పురస్కారం డాక్టర్ గుంజి వెంకటరత్నంకు, విశిష్ట సాహితీమూర్తి జీవిత కాల సాధన పురస్కారం వరంగల్‌కు చెందిన ప్రముఖ రచయిత రామా చంద్రమౌళికి, సరిలేరు నీకెవ్వరు విశిష్ట రంగస్థల పురస్కారం కోట్ల హన్మంతరావుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నేత్రపర్వంగా నిర్వహించే 9 నాటికలను ప్రతీ రోజు మూడు చొప్పున కాళోజీ కళాక్షేత్రంలో సాయంత్రం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు: 98662 53646 / 99490 13448 లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సహృదయ సంస్థ ప్రతినిధులు రామకోటేశ్వర్‌రావు, వనం లక్ష్మీకాంతరావు, ఏవీ నర్సింహారావు, కె.కృష్ణమూర్తి, న్యాలకొండ భాస్కర్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, కనుకుంట్ల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జనవరి 24 నుంచి పలు రైళ్లు రద్దు

మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులే కారణం

కాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో మూడో రైల్వే లైన్ నిర్మాణంతో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 14 వరకు, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష రూట్లలో వెళ్లే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. (67771) సిర్పూర్ టౌన్ - కరీంనగర్‌ల మధ్య మెము అప్ అండ్ డౌన్ రైలు, (17003) కాజీపేట - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే మెము ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17004) కాజీపేట - బల్లార్ష మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట -బల్లార్ష మధ్య నడిచే సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు రద్దు కానున్నాయి. జనవరి 24 బల్లార్షా మీదుగా ఢిల్లీ వైపు వెళ్ల మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లించి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నాగేంద్రుడికి నెమలి వాహనసేవ

గీసుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా తయారు చేయించిన నెమలి వాహనంలో ఆసీనులైన సుబ్రహ్మణ్యేశ్వస్వామి, వల్లిదేవి, దేవసేనాదేవి విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి తరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.


నెమలి వాహనంలో ఆసీనులైన ఉత్సవ మూర్తులు

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం..

- సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
- మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ప్రారంభం

వాజేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కర్రెగుట్టలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకునేందుకు వాజేడు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన మురుమూరులో సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేసి మంగళవారం ఆ క్యాంపును ప్రారంభించారు. సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్రెగుట్ట హిల్స్‌తో సీఆర్పీఎఫ్ క్యాంపును ప్రారంభించిన ఐజీ విక్రమ్ మాట్లాడారు. కర్రెగుట్ట అడవులను సురక్షితంగా ప్రదేశంగా ఉంచేందుకు ఈ క్యాంపుల ముఖ్య ఉద్దేశమన్నారు. మురుమూరులో బేస్ క్యాంపు ఏర్పాటుతో పాటు పాముసూరులో మరో క్యాంపు ఏర్పాటు చేసి కర్రెగుట్టల వరకు రహదారి నిర్మాణం చేపడతామని ఆయన అన్నారు. కర్రెగుట్టలను అభివృద్ధి చేయడంతో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఇక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కర్రెగుట్టలను సురక్షితం, శాంతిని నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అటవీ శాఖ, రెవెన్యూ స్థానిక పోలీసుల సహకారంతో త్వరితగతిన ఈ క్యాంపును ఏర్పాటు చేయగలిగామని ఆయన పేర్కొన్నారు.

కాగా, ఈ క్యాంపులో సుమారు 350 మంది సీఆర్పీఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రయివేటు భూమిలో ఐదేళ్ల పాటు లీజుకు తీసుకొని క్యాంపును ఏర్పాటు చేయగా ప్రస్తుతం తాత్కాలిక టెంట్లు, మరుగుదొడ్లను నిర్మించి క్యాంపు అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ క్యాంపును నిర్మించి సీఆర్పీఎఫ్ పూర్తి కార్యకలపాలను చేయనుంది. ఈకార్యక్రమంలో హైదరబాద్ రేంజ్ డీఐజీ అనిల్‌మింజ్, కమాండెంట్ ప్రశాంత్ శ్రీవాత్సవ్, ములగు ఓఎస్‌డీ శివంఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, సీఐ రమేష్, ఎస్సైలు సతీష్, తిరుపతిరావులు పాల్గొన్నారు.


బేస్ క్యాంప్ నమూనాను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ తదితరులు

'సానుభూతి పరుల ముద్రను తొలగించండి'

సీఆర్పీఎఫ్ క్యాంపు ప్రాంభోత్సవంలో మురుమూరు మాజీ సర్పంచ్ పూసం నరేష్ మాట్లాడారు. తమ పంచాయతీలో కొంత మంది వ్యక్తులను మావోయిస్టు సానుభూతిపరుల ముద్ర వేసి తరచూ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు. ప్రస్తుతం మారిన పరిస్థితుల్లో ఆ ముద్రను తొలగించాలని ఆయన ఈ సందర్భంగా ఐజీ విక్రమ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను కోరారు.

కేంద్ర బలగాల చేతికి కర్రె గుట్టలు

మురుమూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాల పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుందని తెలుస్తోంది. బేస్ క్యాంప్‌లో సుమారు 350 సీఆర్పీఎఫ్ జవాన్‌లు విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండగా అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్‌ల సాయంతో నిత్యం కర్రెగుట్టలపై నిఘా ఉంచనుంది. కర్రెగుట్టల్లో మిగిలిన మావోయిస్టుల కోసం కేంద్రం వేట కొనసాగిస్తుందని తెలుస్తోంది. కర్రెగుట్టలపైకి రహదారి నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే నిత్యం జనసంచారం ఉండడంతో మావోయిస్టులు కర్రెగుట్టలో తల దాచుకునే పరిస్థితి ఉండదు. దీంతో మావోయిస్టులు లొంగి పోవడమో లేక ఇతర మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. కర్రెగుట్టల చుట్టూ సీఆర్పీఎఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని ఐజీ విక్రమ్ తెలపడంతో కర్రెగుట్టలు మొత్తం సీఆర్పీఎఫ్ బలగాల చేతికి వెళ్లినట్లేనని చెప్పుకోవచ్చు. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆనుకొని ఈ కర్రెగుట్టల ఉండగా, ఈ ఏడాది మార్చి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాలు పూర్తిగా ఆధీనంలో తీసుకొని మావోయిస్టుల ఏరివేతను ప్రారంభించాయి. దీంతో మావోయిస్టు పార్టీ కోలుకోలేని స్థితికి వెల్లడంతో మావోయిస్టు అగ్రనాయకులు లొంగిపోవడంతో పాటు సీసీ సభ్యులు ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. వందల సంఖ్యలో మావోయిస్టులు చత్తీస్‌గడ్, మహారాష్ట్ర మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల ముందు ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఇటీవల మావోయిస్టు అగ్రనాయకుడు హిడ్మా సైతం మృతిచెందడంతో మావోయిస్టు ఉద్యమం మరింతగా నీరుగారిందని చర్చలు జరుగుతున్నాయి. తాజా వాజేడులోని మురు మూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలపాలకు చెక్ పడనుంది.

ఈసారి ఏకగ్రీవాలు ఏ మేరకు ఉండేనో ?

- అందని రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు
- మొండిచేయి చూపిన గత ప్రభుత్వం
- ఎంపీలు, ఎమ్మెల్యే నుంచి రాని మరో రూ.10 లక్షలు
- నిరాశకు లోనైన గత పంచాయతీ పాలక వర్గాలు

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. మరో 24 గంటల్లో ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కాబోతోంది. దీంతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సమరం మొదలు కానుంది. ఈసారి కూడా ఏకగ్రీవమైన పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే నజరానా ప్రకటించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ప్రోత్సాహకంగా రూ. 10 లక్షలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది.

ఇంత వరకు బాగానే ఉంది. ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయనే విషయంలోనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్పందన ఎలా ఉంటుందన్నదే చర్చనీయాంశం అవుతోంది. ఇందుకు కారణం గత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఏకగ్రీవాలు చేసుకుంటే పాలకవర్గాల కాలపరిమితి ముగిసే నాటికి ఎలాంటి నిధులు రాలేదు. ఈ ప్రోత్సాహకాలు అందనందువల్ల ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోయామని మాజీలు అభిప్రాయపడుతున్నారు.

మొర ఆలకించలేదు

గత పంచాయతీ ఎన్నికలు 2019 జనవరి 21,25,30 తేదీల్లో మూడు విడతలుగా జరిగాయి. పాలక వర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరగలేదు. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లాయి. గత అయిదేళ్ల గ్రామ పంచాయతీల అభివృద్ధికి అనుకున్న స్థాయిలో గ్రాంట్లు విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కొన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులు అప్పులు తెచ్చి పనులు చేశారు. పాలక వర్గాలు స్థానిక నేతలు, ఎమ్మెల్యే ద్వారా తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రోత్సాహకాలన్నా ఇప్పించాలని ప్రాధేయపడినా ఫలితం దక్కలేదు.

ప్రశాంతంగా ఎన్నికలకు...

పంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా, వివాదాలక తీతంగా ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజలు ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవాలను ప్రోత్సాహకంగా ఈ నజరానాను ప్రకటించింది. గత ప్రభుత్వం కూడా ఇలాగే ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహకాలను ఇస్తానని వాగ్దానం చేసింది. సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా చేసుకున్న ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షలు ఇస్తానంది. పైగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆయా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. వెరసి రూ. 20 లక్షల నిధులులొస్తాయి. గ్రామాన్ని ఎంతకొంత అభివృద్ధి చేసుకోవచ్చునని ప్రజలు ఆశపడ్డారు. దీనితో వీరంతా ఏకమై పార్టీలను పక్కన పెట్టి ఏకగ్రీవాలకు కలిసికట్టుగా కదిలారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీల్లో 284 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. ఇందుకు సంబంధించి రూ. 56 కోట్లు రావాల్సి ఉంది. కానీ పాలక వర్గాల పదవికాలం ముగిసినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. అటు ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం తాము ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏకగ్రీవంగా గెలిచినవారు వాపోయారు.



వివరాలు తీసుకున్నా..

గత ప్రభుత్వం ఏకగ్రీవ ప్రోత్సాహకాలు ఇస్తానని జిల్లా పంచాయతీ అధికారుల నుంచి వివరాలను తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాల వివరాలను పంపించారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. గతంలో పంచాయతీ పాలకవర్గాల సమావేశాల్లో కూడా సర్పంచ్‌లు ప్రోత్సాహకం విషయమై పలుమార్లు లేవనెత్తారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలు ప్రోత్సాహక నిధులు వస్తాయనే ఆశతో పాలకవర్గాలు అత్యవసర పనులకు తీర్మానం చేసికొని పనులను పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం నిరీక్షించారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు ప్రభుత్వం డబ్బులు ఇస్తే తీసుకుంటామనే భావనతో పనులు పూర్తి చేయగా మరికొందరు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కొన్ని చోట్ల అసలు ఆ డబ్బులు రాకపోవడంతో ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో గ్రామస్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవాలకు రూ. 10 లక్షలు ఇస్తానని ప్రకటిస్తున్నందునా ఈసారి అవైనా వస్తాయా ? అన్న సందేహాన్ని గ్రామీణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చదువు కొంచెం.. పనులు ఘనం

- మినీ కల్టివేటర్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ
- పలు అవార్డులకు సీతారాంపురం వాసి ఎంపిక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిపాల్‌చారి


ఎలక్ట్రికల్ కారుగా మార్చిన పాత కారు వద్ద మహిపాల్‌చారి

పరకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తుంది నేటి యువత. పుట్టింది పల్లెటూరు, పెద్దగా చదువుకోకపోయినా ఢిల్లీ వరకు వెళ్లి రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు మహిపాల్‌చారి. హనుమకొండ జిల్లా పరకాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కె.మహిపాల్‌చారి పదో తరగతి ఫెయిల్ అయి తల్లిదండ్రులు మందలిస్తే హనుమకొండకు వెళ్లి అలంకార్ థియేటర్ సమీపంలో ఓ మెకానిక్ వద్ద చేరాడు. మెకానిజంలో నైపుణ్యంతో అనతికాలంలోనే గడ్డిని తొలగించేందుకు మినీ కల్టివేటర్‌ను తయారు చేశాడు. అది తమకు కావాలంటూ రైతుల నుంచి ఆర్డర్లు వచ్చాయి. పది మందిని ఏర్పాటు చేసుకొని అధిక సంఖ్యలో కల్టివేటర్లు తయారు చేసి రైతులకు అందించేవాడు.

2015లో రాష్ట్రపతి అవార్డు

మహిపాల్‌చారి తయారు చేసిన మినీ కల్టివేటర్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డును అందుకున్నాడు. అప్పటి నుంచి ప్రతియేటా 500లకు పైగా మినీ కల్టివేటర్లు తయారు చేస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులకు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాడు. ఇదే కాకుండా నేషనల్ ప్రీమియర్ ఎంటర్‌షిప్ అవార్డు కూడా కేంద్ర ప్రభుత్వం 2016లో అందించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్రామీణ సృజన శక్తి వెలుగుదారుల వేదికపై ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహిపాల్‌చారికి సంబంధించిన సృజనాత్మకతో ప్రతిబింబించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాత వాటిని ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారీ

ఇటీవల ప్రజలు ఎక్కువగా ఎలక్ట్రికల్ వాహనాలపై మక్కువ చూపడంతో బోర్‌కు వచ్చిన వాహనాలతో పాటు మూలన పడ్డ వాహనాలకు ఎలక్ట్రికల్ వాహనాలుగా మార్చుతున్నాడు. నాలుగు గంటలు చార్జింగ్ చేస్తే 60 నుంచి 100 కిలోమీటర్ల వరకు వెళ్లే బైక్‌ను తయారు చేశాడు. ఇందుకు రూ. 35 వేలు ఖర్చవుతుందని, ఎవరికైనా కావాలంటే పాత వాహనాలను ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారు చేసి ఇస్తానని మహిపాల్‌చారి పేర్కొన్నారు. అలాగే కారుకు 4 గంటల చార్జింగ్‌తో 70 నుంచి 250 కి.మీ. వరకు ప్రయాణించేలా రూ. 1 లక్షా 50 వేల ఖర్చుతో అందజేస్తున్నారు. గ్రామీణ యువకుడు ఇలా ప్రజలకు అవసరమయ్యే వస్తువులను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



అవార్డు అందుకుంటున్న మహిపాల్‌చారి




ఏజెన్సీలో మంచు దుప్పటి



ఇబ్బందులు పడిన వాహనదారులు

ఏజెన్సీ కొత్తగూడ మండలంలో మంగళవారం ఉదయం మంచు దుప్పటి కప్పింది. మంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో మంచు కప్పడంతో ప్రజలు ఆహ్లాదానికి గురయ్యారు.

- కొత్తగూడ (ఆంధ్రజ్యోతి)



మహిళా సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట



బెగ్లూర్‌లో చీరల పంపిణీ చేస్తున్న అధికారులు

కాటారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా వారి సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరుగుతున్నదని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. మంగళవారం మండ ల కేంద్రంలో ఇందిరామహిళాశక్తి చీరలను గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సిబ్బందితో కలిసి కాంగ్రెస్ నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ మండల నేతలు పసుల మొగిలి, కొట్టె శ్రీహరి, చీమల రాజు, అబ్దుల్ అజీజ్, గోనె శ్రీనివాస్, కొమురయ్య, తిరుపతి, సమ్మయ్య, రాజేష్, బషీర్‌ఖాన్, మహిళలు, ఐకేపీ సీసీలు ఉన్నారు.

● మహదేవపూర్ రూరల్ : మండలంలోని బెగ్లూర్ ఎస్‌హెచ్‌జీ మహిళ సంఘం సభ్యులకు మంగళవారం ఐకేపీ అధికారులు చీరలు పంపిణీ చేశారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహిళలందరికి ఐకేపీ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు కట్కూం అశోక్ పేర్కొన్నారు.మాజీఎంపీపీ బన్సోడ రాణిబాయి, నాయకులు పోలు మొండయ్య, ఆకుల సమ్మక్క, రాజయ్య, చల్లూరి సదానందం, దోమల రాజేష్, సీసీ నిర్మల, సీఏ కారు గౌరక్క పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మాజీ జడ్పీకోఆర్షన్ సభ్యురాలు ఎమ్డీ. వలియాబీ, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, గంపల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్ : మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం సెర్ప్ సీసీ బానోత్ జ్యోతి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవోబీలు, వీవోఏలు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● వాజేడు : మండల పరిధిలోని పేరూరులో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇందిరా మహిళ శక్తి చీరలను ఆ పార్టీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. వీవోఏ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, మాజీ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజులు మహిళలకు చీరలను అందజేశారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు నల్లగాసి రమేష్ యాదవ్, ఆత్మకూరి ప్రవీణ్, ఖాజావలి పాల్గొన్నారు.

● ములుగు రూరల్ : మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఇంచర్ల గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో కలిసి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మునినేపల్లి కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శానబోయిన అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపేటలో చీరల పంపిణీలో పాల్గొన్న అధికారులు, మహిళలు

ట్రాన్స్‌కో ఏడీఈగా సుందరకుమార్



ఏడీఈని సన్మానిస్తున్న ఏఈలు, ఇతర ఉద్యోగులు

చిట్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో చిట్యాల సబ్ డివిజన్ ఏడీఈగా సుందరకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా వైరాలో ఏఈగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై చిట్యాలకు వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన సుందర కుమార్‌కు ఏఈలు చంద్రశేఖర్, సందీప్‌కుమార్, సబ్ ఇంజనీర్లు వెంకట్, సుమంత్, శ్రీనివాస్ శాలువా, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

కాలసర్ప దోష నివారణ పూజలు

మహదేవపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మంగళవారం సందర్భంగా కాలసర్ప దోష నివారణ పూజలు చేపట్టారు. ముందుగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం కాలసర్ప దోష నివారణ పూజల్లో పాల్గొన్నారు. కాలసర్ప దోష నివారణ పూజల్లో పాల్గొన్న భక్తులకు నవగ్రహ, దోష నివారణ ఉంటే తొలగిపోతాయని ఈ సందర్భంగా అర్చకులు తెలిపారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు

మహదేవపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మంగళవారం కాటారం డివిజన్ పరిధిలోని పాఠశాలల జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ల్యాబరేటరీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రయోగ దీపికలు నిర్వహించడం, న్యాస్ ఫలితాలు, టెస్ట్ ప్రాక్టిసెస్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, ఎంఈవో ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు

ములుగు టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు కళాశాల వైద్యులు డాక్టర్ సీహెచ్ రాము, ఆర్బీఎస్‌కే ములుగు ఏ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల, కళాశాలలోని సుమారు 500 మంది విద్యార్థులకు 4 డిఎస్‌తో పాటు రక్తహీనత పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన విద్యార్థులకు ఐఎఫ్ఏ మాత్రలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె వైద్యులు డాక్టర్ మల్లికార్జున్, శ్రీలత, ఫార్మసి ఆఫీసర్ మాధురి, ఏఎన్ఎమ్ సుభాషిని, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కె. సదయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

వాజేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నగొల్లగుడెంలో ఓలం కంపెనీ ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ఆ ప్లాంట్ పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ఓలం కంపెనీ మారుమూల ప్రాంతంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం మంచి నిర్ణయమని అన్నారు. ప్రజలు ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్లాంట్ ఏర్పాటుగా స్థలంను దానం చేసిన బొల్లె ఆదినారాయణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలం సరస్వతి, ఓలం కంపెనీ ఆంధ్ర, తెలంగాణ ఇంచార్జీలు ఆదిత్య, హరికృష్ణ, సాంబశివరావులు పాల్గొన్నారు.

సీఎం సహాయక నిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు

ఏటూరునాగారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయక నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం రూ. 3,29000 (మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల రూపాయలు) విలువ గల చెక్కులను ఐదుగురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎమ్డీ. అయాబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, గంపల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఏటూరునాగారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఈనెల 26న జరిగే భారత రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివకుమార్ పిలుపునిచ్చారు. దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని శివకుమార్ తెలిపారు. చిటమట రఘు, వసంత శ్రీనివాస్ యాదవ్, ఇర్సవడ్ల వెంకన్న, ఎమ్డీ. ఖలీల్ ఖాన్, గుడ్ల దేవేందర్, చెన్నూరి బాలరాజు, వావిలాల నర్సింగరావు, చిన్నఎల్లయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు

కాటారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో నేటి(బుధవారం)నుంచి వైభవోపేతంగా దత్త నవరాత్రోత్సవాలు జరగనున్నాయి. దేవాలయంలో 9 రోజుల పాటు వివిధరకాల హోమాలు, ప్రత్యేకపూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు, వేదపండితులు కృష్ణమోహన్‌శర్మ, సుమిత్‌పాండే మంగళవారం తెలిపారు. 26న గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, గణపతి నవగ్రహహోమాలు జరుగుతాయన్నారు. 27న దత్త, రుద్ర, పంచసూక్త హోమాలు, 28న మహాచండీహోమం, 29న మహా నారాయణహోమం, 30న అరుణహోమం, డిసెంబరు1న కాశీకేదారేశ్వరస్వామికి అన్నపూజ, రుద్రహోమం, 2న 16మన్యు సూక్త అభిషేకం, హోమం, 3న మహాసుదర్శనహోమం, 4న దత్త, రుద్ర, పంచసూక్త హోమాలు, మహా పూర్ణాహుతి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని వేదపండితులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి సంపూర్ణ అనుగ్రహాన్ని పొందాలని వారు కోరారు.

సీతక్కపై ఆరోపణలు చేయడం తగదు



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

కన్నాయిగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీల రిజర్వేషన్‌లపై, మంత్రి సీతక్క పై భీముని నరేష్ చేసిన ఆరోపణలు సరికావని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు అన్నారు. మంగళవారం ఆ సంఘం మండల కమిటీ అత్యవసర సమావేశం మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు అధ్యక్షతన జరిగింది. రాజ్యాంగానికి లోబడే మండలంలోని సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్‌లు కేటాయించారని అది తెలియక గిరిజనేతరుడైన భీముని నరేష్ రిజర్వేషన్లపై, మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు చేయడం తగదన్నారు. పీరీల శ్రీనివాస్, ఆలం సంతోష్, యాలం మురళి, కోరం సమ్మయ్య, చిత్త రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో గిరిజనులు ఎదగాలి



చేపపిల్లలు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

మంగపేట నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లల పెంపకం పథకాన్ని వినియోగించుకుని ఆదివాసి గిరిజనులు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో భద్రు అన్నారు. పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొమురం ప్రభాకర్ ఆయా పంచాయతీ కార్యదర్శుల చేతుల మీదుగా పెసా మొబిలైజర్లకు, గిరిజన మత్స్య సంఘాల అధ్యక్షులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ క్షేత్ర అధికారి రమేష్, సిబ్బంది మౌనిక, నిహారిక, పంచాయతి కార్యదర్శి రాజేష్ పెసా మొబిలైజర్లు జోగ నరేంద్ర, తాటి విజయ్, పొడెం నాగేశ్వర రావు, సొలం బాబు, సుమలత పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో వందేమాతర ఉత్సవం



పస్రాలో వందేమాతరం ఆలపిస్తున్న బీజేపీ నాయకులు

గోవిందరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రాలో బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో వందేమాతరం 150వ ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు జాతీయ రహదారిపై వందేమాతరం గేయాన్ని ఆలపించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నా యకులు తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, మద్దినేని తేజ రాజు, నరేష్, తాళ్లపల్లి లక్ష్మణ్, సిద్దబోయిన సురేందర్, కర్ర సాంబశి వరెడ్డి, కొమురపాలెం దర్మారావు, బాబూరావు, సురేష్, లలిత, సత్యనారా యణ, అంజిరెడ్డి, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

గోవిందరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పైడాకుల అశోక్ రెండోసారి ఎంపికైన సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు అశోక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ నాయకులు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, దాసరి సుధాకర్, జెట్టి సోమయ్య, గొంది కిరణ్, జక్కు రణదీప్, పొన్నం సాయితేజ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



క్రికెట్ జట్టు సభ్యులతో కుంజా సూర్య తదితరులు

ములుగు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అభివృద్ధికి కృషి చేసి, క్రీడాకారులను ప్రోత్సహిస్తానని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కుంజా సూర్య అన్నారు. జిల్లా కేంద్రంలో టీం సూర్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడా జట్లకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో 16 టీంలు పాల్గొనగా రుద్ర లెవన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీం మొదటి విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కోచ్ పైడిమల్ల సందీప్ నేత్ర గౌడ్, ఆర్గనైజింగ్ మెంబర్స్ రంజిత్ కుమార్, కిరణ్ ప్రసాద్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

మల్హర్ : క్రీడలతో కార్మికులు, ఉద్యోగులు, అధికారులు మధ్య స్నేహ భావం పెంపొందుతుందని ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాడిచర్ల ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న ఏఎమ్మార్ ఎనిమిద వార్షికోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. గత పది రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టి ఆఫీసర్ సురేష్‌బాబు, హెచ్ఆర్‌డీజీఎం రమేష్‌బాబు, బొబ్బిలి నరేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులను అందిస్తున్న ప్రభాకర్ రెడ్డి

ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజాపాలనలో గ్రామాల సమగ్రాభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ జంషెడ్‌బేగ్‌పేట గ్రామాల మధ్య రూ 3 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఏటా కురుస్తున్న వర్షాలతో బ్రిడ్జి మునగడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేశామన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, సీనియర్ నాయకులు సూరం వీరెందర్, సాయిని విజయ, మటిక సంతోష్, పున్నం రవి, మైస భిక్షప తి, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

జర్నలిస్టులపై వివక్ష చూపడం సరికాదు

కృష్ణకాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పట్ల వివక్ష చూపడం సరికాదని, తాము అధికారంలో ఉన్న సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలాలను వెంటనే కేటాయించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో పట్టాలు పొందిన 37 మంది జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షను మంగళవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతో స్థలాలు చూపించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. వారి న్యాయమైన కోర్కెను వెంటనే తీర్చాలని, వీరందరికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, బీఆర్ఎస్‌జిల్లా నాయకులు సెగ్గం సిద్ధు, గణపురం మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, యూత్ నాయకులు పోలవేని మహేందర్ యాదవ్, కొల్లోజు దిలీప్‌కుమార్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

' టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

భూపాలపల్లిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఈ మెయిల్స్ పంపించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు నక్క తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి తెలిపారు. ఈ నెలాఖరులోగా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిసి వనితి పత్రం అందజేస్తామన్నారు.

ఆలయాభివృద్ధికి శంకుస్థాపన

గణపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు కట్టపై ఉన్న దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం శంఖుస్థాపన చేశారు. రూ. కోటిల నిధులతో ఆలయ అభివృద్ధి జరగనున్నట్లు తెలిపారు. అనంతరం చెల్పూరులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి హాజరై మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజేందర్, చోటేమియా, శ్రీనివాస్, రవి, వెంకన్న, మలహల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చదువు విలువ, గొప్పతనంపై అవగాహన

మల్హర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : చదువు విలువ, గొప్పతనంపై తాడిచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు పాటల రూపంలో కళాజాత బృందాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి మాట్లాడుతూ విద్యార్థులు బుద్ధిగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసై జీతాలు నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిరీష సంస్కృతిక కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

బోర్ మోటార్ ఏర్పాటు

కాటారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని యాదవకాలనీలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు చేపట్టారు. మంత్రి శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయడంతో బోర్ వేసి మోటార్ బిగించినట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చీమల రాజు తెలిపారు. బోర్ మోటార్‌ను మంగళవారం స్థానిక ప్రజలతో కలిసి ఆన్ చేసి నీటి సరఫరా జరిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు సందీప్, మొగిలి, శ్రీహరి, రాజేష్, మహేష్, అజీజ్, మహేందర్, బాపు తదితరులుఉన్నారు

ఆరోగ్య మహిళా కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు

వెంకటాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 76మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు పవన్, మనోహర్, జ్యోతి పాల్గొన్నారు.

పథకాలపై నిరుద్యోగులకు అవగాహన

కాటారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మంది రంలో మంగళవారం పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం)పథకాలపై నిరుద్యోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, ఈడీసీ(ఎంటర్‌ప్రెన్యూర్‌డెవలప్‌మెంట్ సెల్) మేనేజర్ వెన్నెల, కేవీఐబీ విశ్రాంత ఉద్యోగి అశోక్‌కుమార్ ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెన్యూర్స్)సంస్థలను పెట్టుకుని ఉపాధి పొందేలా అధికారులు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అడ్డూరి బాబు, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ నరేందర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చలో సూర్యాపేట పోస్టర్ ఆవిష్కరణ

కన్నాయిగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28 న తలపెట్టిన చలో సూర్యాపేట రణభేరి భహిరంగ సభ పోస్టర్‌ను మండలంలోని బుట్టాయిగూడెంలో మండల అధ్యక్షుడు పాలకుర్తి శ్రీధర్ గౌడ్ , మండల గౌరవ అధ్యక్షుడు మారగోని రాజు గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల 28 న జరిగే రణబేరి సభకు గౌడులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు తాడూరి రఘు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక

వెంకటాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు మండలంలోని లక్ష్మీదేవిపేట క్రీడాకారుడు గోగు శేషు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, జనార్దన్‌లు మంగళవారం తెలిపారు. ఈనెల 27నుంచి 30వతేదీ వరకు హర్యాన రాష్ట్రంలోని సోనిపాట్‌లో జరిగే 35వ జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో శేషు తెలంగాణ తరఫున పాల్గొంటాడని అన్నారు.

కల్లు గీత కార్మికుల సభను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కల్లు గీత కార్మికులు

ములుగు టౌన్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 28న జరిగే చలో సూర్యాపేట రణబేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉయ్యాల మధూకర్ గౌడ్ అన్నారు. మంగళవారం జంగాలపల్లి తాటి వనంలో కల్లుగీత కార్మికులు రణబేరి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బాపూర్, ఇంచర్ల గౌడ సంఘం సొసైటీ సభ్యులు ఆరెల్లి సదానందం, మోటపోతుల సురేందర్ గౌడ్, నాయకులు తాళ్ళపెల్లి సారయ్య గౌడ్, దూలం శ్రీనివాస్ గౌడ్, భీమగాని సాంబయ్య గౌడ్, భీమగాని భిక్షపతి గౌడ్, వేముల కృష్ణ గౌడ్, వేణు గౌడ్, రాగుల ప్రణయ్ గౌడ్‌లు పాల్గొన్నారు.